# ౫. అవసరంలేని ఆపరేషన్

"ఆ బాణసంచా అడావిడి యేమిటి?"

"టీపార్టీ"

"యెవరికి?"

"యీ వూరు ఆడ డాక్టరికి బదిలీ అయింది"

"యింత అడావిడా?"

"యీ వూరి ప్రజలకి ఆమెనిచూస్తే అత్యంతాభిమానం"

"యెందుకో?"

ఐదేళ్ళలోనూ వాళ్ళని పదివేల రూపాయలు బ్యాంకిలో వేసుకుంది. అందుకని"

"అంత తెలివిగలదా?"

"అదేమో! మొదటి సంవత్సరం ఆమె మొహాం చూచినవాడు లేడు. కాని ఆ జూలైలో గావును ఒక విచిత్రమైన కేసు కుదిర్చింది. దాంతో ఆమె ప్రభ అద్వితీయంగా వెలిగింది యీ నాలుగేళ్ళూ"

"యేం కేసేమిటి?"

"అదే తమాషా, అందులో యీమె ప్రయోజకత్వమేమీ లేదు. కీర్తిమాత్రం యీమెకి దక్కింది. వాళ్లుమాకు బంధువులే. చెప్పనా? ఆమెకి ముప్పైయేళ్ళు—"

"డాక్టరుకా?"

"కాదు. మా బంధువురాలొకామెకి. ఆమెకి పిల్లలు లేరు. పిల్లలు లేకపోతే బతకడమెందుకనే మనోవ్యాధి పట్టుకుందామెకి. యింక బిడ్డలకోసం వాళ్ళుపడ్డ శ్రమా, చేసిన ప్రయత్నాలూ, యిన్నన్నికావు. యెన్ని మందులో, యెన్ని

యాత్రలో, యెన్ని మొక్కుల్లో, యెన్ని విధాలైన ప్రదక్షి
ణాలో, యెంతమంది బైరాగులకీ, సన్యాసులకీ బహుమతులో!
యేమీ లాభంలేక, విసుగెత్తిపోతూ ప్రతివారితో తన కథ
చెప్పుకుని యేడుస్తూ, పడివుంది. చిన్నదానివింకా నీకింత తొందర
రేమిటి, నిరాశ యేమిటంటే వినదు. చివరకి ఒక పిల్లాణ్ణి
తెచ్చి పెంచుకుంటే, వాడు యీమె ముద్దులు భరించలేక
పారిపోయినాడు. తరవాత చెన్నపట్నంనుంచి పెద్ద బొమ్మ
నొక దాన్ని తెచ్చుకుంది. ఆ బొమ్మకి పాలిచ్చీ, ముద్దాడీ,
నీళ్ళుపోసీ, చొక్కాలు తొడిగీ, అది చేతులూ కాళ్ళా
డించాలనీ, యేడవాలనీ, మాట్లాడాలనీ, ఆమె చేసే ప్రయ
త్నం, చూస్తే అందరికీ అమితమైన జాలి కలిగేది. మా
బంధువుల్లో పిల్లలులేని దరిద్రులెవరూ లేరు. కనుక యీమె
సిగ్గుపడి, పిల్లలులేనిపాపం చేసినట్లు, యే కార్యాలకీ యెక్క
డికీ వెళ్ళడం మానేసింది. యెవరు తన యింటికివచ్చినా, వాళ్ళు
తనని హేళనచేస్తున్నారే అనుకుంది. పిల్లలకోసం యీమె
చెయ్యడానికి నిరాకరించేపనివుందా అనిపించేది. యింతలో
ఆవూరొక స్వాములార్లమీది గొప్పస్వాములవారు వొచ్చారు.
గొడ్రాళ్ళకి పిల్లలు పుట్టించడంలో ఆయన బహునేర్పరి. గుం
పులు గుంపులుగా ఆడవాళ్ళాయన్ని దర్శించి కృతార్థు లౌతు
న్నారు. ఒక్క వితంతువులు మాత్రం, ఆయన గాలితగిలితే,
తమ కేవుపద్రవం కలుగుతుందో అని దూరాన తప్పుకొంటు
న్నారు. సరే, యీమె ఆయన దర్శనానికి వెళ్ళింది. పదిహేను
రోజులలో గర్భిణి చిన్నాలు కనపడ్డాయి. వేవిళ్ళు మొదలైన
సంగతులన్నీ సక్రమంగా జరిగాయి. యింక వుత్సవాలేమిటి ?

సూడిదలూ, వొచ్చేబంధువులూ, పోయేబంధువులూ, పది నెలలూ ఒకటే పండగగా గడిచింది పదినెలలూ దాటాయి; కనలేదు. సంవత్సరమయింది కడుపు అట్లానేవుంది. వాళ్ళకి భయమేసి యీ డాక్టరు ధగ్గిరికి తీసుకొచ్చి చూపారు. ఆమె పరీక్షచేసి అది కడుపుకాదని రూఢిగా చెప్పింది. ఆ మాట వినగానే పాపం యీ పిల్ల మూర్ఛపోయింది. బంధువు లంతా గొల్లుమని యేడ్చారు. వారంరోజులు మందిచ్చేటప్పటికల్లా పొట్టకాస్తా కరిగిపోయింది. యిట్లా పదినెల్ల గర్భిణిని, వారం రోజుల్లో మాయంచెయ్య శక్తిగలిగిన డాక్టరు, తిరిగి దాన్ని నిజంగా రప్పించలేదా అనే గట్టి విశ్వాసం వాళ్ళకు కుదిరింది. ఆమె తనకి చాతకాదు, పొమ్మన్నా వాళ్ళు కదలలేదు. ఒక రోజు రాత్రి యీ మొపోయి డాక్టరు కాళ్ళమీదపడి బతిమాలుకుని తనకి సంతానం కలిగిస్తే పదిహేనువందల కాసులపేరు యిచ్చేస్తానంది. ఆమె ఆపరేషన్ చేసి చూస్తానంది.

యీ డాక్టరు భర్త బి. య్యే. పాసై ,ఎండాకాలపు శలవలకి యీమె యింటో వున్నాడు. ఒకరోజు భార్య అస్పత్రికి వెళ్ళినప్పుడు యీ అమ్మాయి వొస్తే నవ్వి చెయ్యి పట్టుకుని దగ్గిరికి లాక్కున్నాడు. యీ అమ్మాయి చాలా పూర్వాచార పరాయణురాలు. దైవభక్తిలో, భర్తసేవలో, పెరిగిన మనిషి; పరపురుషుల ధ్యానం యింతవరకెరగదు. అట్లాంటిది బలవంతంగా తటస్థించినా చాల ఘోరపాపమని జంకుతుంది- అతనిపైసి గౌరవంచాతా, భయంచాతా, యేమి అనకపోయినా ఆతప్పించి తప్పించుకుని, ఒక్కమాట మాట్లాడకండా వెళ్ళిపోయింది- మళ్లీ వొంటరిగా ఆయింటికి వెళ్లలేదు-

కాని అతనికి మాత్రం ఈమె మీాద మమకారం ఏమాత్రమూ వదలలేదు.

మర్నాడు ఆపరేషన్ నిశ్చయమయింది. ఆ సాయంత్రం ఆ అమ్మాయి భయంతో డాక్టరింటో యేడుస్తోకూచుంది. తనభార్య పక్కగదిలోకి వెళ్లినప్పుడు, ఈమెతో "వూరికే యేడవకు. ఈ డాక్టర్ కేం తెలుసు. ఈఆపరేషన్ లేకుండా అనేక మందులున్నాయి. మళయాళంలో కాశ్మీరంలో అనేక క్రియలున్నాయి. అవి నాకు తెలుసు. డాక్టరాస్పత్రికి వెళ్లిం తరవాత రా చెపుతాను" అన్నాడతను. ముందు వేళాకోళ మనుకుంది. కాని ఆలోచించగా, ఒకవేళ అతనికేదన్నా మంత్రం తెలిసివుండకూడదా అని తట్టింది. ఆపరేషనంటే ఆమెకున్న మహాభయమూ, బిడ్డమీాది ఆపేక్షా ఆమె విశ్వాసాన్ని మరింత బలపరిచాయి. యింటికివెళ్ళి భర్తతో చెపితే, తప్పకుండా వెళ్లి కనుక్కోమన్నాడు. ఆమె రాగానే, డాక్టరుభర్త కూచోపెట్టి ఈ సంగతులు మాట్లాడాడు"

"ఈ పిల్లలు పుట్టకపోవడము, నీలోపమూకాదు, నీ పూర్వజన్మలోపమూకాదు. దేవుడికి నీమీాద ఆగ్రహమూ కాదు. లోకంలో గడ్డిపరకలకి వెయ్యిగింజలూ, ఈగలకి లక్షగుడ్లూ ప్రసాదించే ఈశ్వరుడు నిన్ను గొడ్రాల్ని చెయ్యాలని వుద్దేశ్య పడతాడా? లోకమంతా జననీ ప్రేమతో మోగిపోతోవుంటే, "బిడ్డా!" అని యేడ్చే నీకు బిడ్డలు లేకపోవడమేమిటి? పోనీ, నీ దేహంలో రుగ్మతవుందా? యేమాలా లేదు. కోపం తెచ్చుకోకు, లోపమంతా నీభర్తది. ఆయన వంశంలో పిల్ల లెక్కువమంది వుండరు-అవునా?"

"మరి ఆయనకి ఆపరేషన్ చెయ్యాలా?"

"లాభం లేదు"

"ఐతే యెట్లా?"

"యెట్లానూ లేదు"

"యేదో చెపుతామన్నారు, మరి!"

"మరి చెపితే కోపం తెచ్చుకోవుకద!"

"చెప్పండి"

"నీకు ఆవు వుందనుకో, దానికి దూడకావాలి. ఒక యెద్దుదగ్గిర యెదకాకపోతే యేంచేస్తారు?"

సిగ్గుతో మాట్లాడలేదు.

"చెప్పుమరి! యింకో యెద్దుదగ్గిరికి తోల్తారు అంతే"

మాట్లాడకండా కూర్చుంది స్తంభించిపోయి.

"నేను చెప్పేమాట విను. నీకు పిల్లలంటే వెర్రి. పిల్లలు లేకుండా బతకలేవు. గంపెడు పిల్లల్ని కడుపారా కనేందుకు నిన్నూ నీ శరీరాన్నీ, నీ మాతృహృదయాన్నీ సృష్టి యేర్పరిచింది. అందుకే యీబాధ నీకు పిల్లలూ, వారిమీదిప్రేమా స్త్రీకి జన్మహక్కు; సహజం. అవే స్త్రీ జీవితానికి మకుటాలు. అవిలేక జీవితం శుష్కం, అర్థవిహీనం. అంకుకునే యెంత అణుచుకుందామని ప్రయత్నించినా అణగని ఆబాధ నీకు. యింక ముందు యింకా బాధ పడతావు. ఈయాత్రలూ, మంత్రాలూ, ఆపరేషన్లూ యేం లాభం? ఆయన్ని మార్చువుకదా?"

"ఆయనకేమి జబ్బులేదే?"

"లేదు. కాని యిదే జబ్బు."

"యేది?"

"నీకూ ఆయనకీ జత కుదరలేదు"

"ఐతే."

"జత కుదుర్చుకోవాలి"

"అంటే?"

"వేరే పెళ్లి చేసుకోవాలి—"

"ఆయన చేసుకునేం లాభం?"

"ఆయనకాదు నువ్వు—"

"నేనా? పెళ్ళా?"

"పెళ్ళంటే పల్లకిలో వూరేగడం కాదు. యింకో భర్తని బిడ్డలకోసం మాత్రం—"

"పోండి" అని లేచింది.

"ఆ కోపమే వద్దన్నాను. బిడ్డల్ని యెత్తుకోకండా, ఆడించకండా వాళ్ళ ముద్దులు చూడకండా వుండ గలవా? వెళ్ళకు. ఒక్క మాట విను. మా అబ్బాయిని చూశా వుగా! అట్లాంటివాడు పుడితే! మేము సంతానాలకి ప్రసిద్ధి. మా గాలి తాకితేచాలు. మేము పన్నెండుగురం మా తల్లికి. మాలో ఒక్కొక్కరికి నలుగురు పిల్లలకన్న తక్కువ లేరు."

వెళ్ళిపోయి, రాత్రంతా ఆలోచించుకుంది. మర్నాడు సాయంత్రం డాక్టరు భర్త టెన్నిసుకి వెడుతో వుండగా, ఆమె గుమ్మంలో సిగ్గుతో యెదురయ్యింది. ఆ సాయంత్రానికి ఆమెతో యింటోనే వుండిపోయినాడు... ... ...

ఆమె ఆపరేషన్ మానేశి తన వూరు వెళ్ళింది, మూడు రోజులతరవాత. యేడాదైనతరవాత చక్కని పాపాయినెత్తుకుని

వొచ్చింది, డాక్టరు దగ్గిరికి– ఆ అమ్మాయి భర్త చాలా సంతోషంతో, గర్వంగా–"ఆపరేషన్లన్నారు. ఒక వంద వొదిలేవి! యేమి లేకండానే యెట్లాంటి పిల్లవాడు కలిగాడో? ఈశ్వరుడి దయవుంటే యేమన్నా• జరుగుతుంది" అన్నాడు.

డాక్టరు, భర్తని పిలిచింది.

"చిన్నప్పుడు మన పెద్దఅబ్బాయి అచ్చు యిట్లానే వుండేవాడు కదూ ?" అంది.

డాక్టరుకి ఆ అమ్మాయి భర్త ఒక చీర యిచ్చాడు. డాక్టరు భర్తకి బంగారపువాచీ గొలుసూ యిచ్చింది ఆ అమ్మాయి అప్పణ్ణించి ఈమె కీర్తి దివ్యంగా వెలిగింది.

# అవతారమా?

పంచానన తీర్థులు స్ఫురద్రూపి. యోగాభ్యాసమూ, మంత్రబలమూ, పరమార్థజ్ఞానమూ, శాస్త్రపాండిత్యమూ, వున్న మనిషివలె కనపడతాడు. తాటిపర్తికి యెక్కణ్ణించి వచ్చాడో తెలీదు. ఆవూరి మహాదాత, స్థితిపరుడు, రామచంద్రరావుగారు యీయన్ని రైల్లో కలుసుకుని, ఆయన సంభాషణకీ ప్రజ్ఞకీ సంతోషించి తన యింటికి ఆహ్వానించాడు. తీర్థులుగారి శక్తివల్ల రామచంద్రరావుగారికి లేక లేక చక్కని కొడుకు పుట్టాడు. ఆయన వదినగారు యేదో మంత్రోపదేశమయింది. ఆయన మేనల్లుడి క్షయ కుదిరింది. ఆయన అన్న కొడుకు బ్రహ్మసమాజం వొదిలాడు. ఇదిగాక వూళ్లో అనేక